సేంద్రియ సాగుతో లాభాల పంట

- సహజసిద్ధ ఎరువులపై ప్రత్యేక దృష్టి
- ఖర్చు తక్కువ..దిగుబడి ఎక్కువ..
- పశువుల ఎరువు చేనుకు ఎంతో బలం
- వేసవి దుక్కులతో చేనుకు లాభం


పశువుల ఎరువును చేలో వేస్తున్న రైతులు

కృత్తివెన్ను: తొలకరి చినుకులు ప్రారంభమయ్యాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ముందుగా వేసవి దుక్కులతో సాగుకు శ్రీకారం చుడుతున్నారు. పూర్వీకుల మాదిరి సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని సంకల్పిస్తున్నారు. దీనిలో భాగంగా రైతులు తమ పొలాలకు పశువుల ఎరువును వేసి సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తున్నారు. కృత్తివెన్ను మండలంలో దాదాపు 5 వేల ఎకరాలలో ఖరీఫ్‌ను సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. చేనుకు బలం చేకూర్చి నాణ్యమైన ఉత్పత్తులతో పాటు, ఆశాజనక దిగుబడులు అందించడంలో సేంద్రియ ఎరువుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతులు ప్రకృతి సేద్యంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. దీనిపై వారు ఇస్తున్న కొన్ని సూచనలు, సలహాలను తెలుసుకుందాం...

రైతుకు లాభం... చేనుకు మేలు

గ్రామీణ ప్రాంతాలలో మనకు విరివిగా లభ్యమయ్యే పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, చీకిన వరిగడ్డి, చెరువులు, కుంటల్లో పూడిక తీసిన మట్టిని పొలాలకు తరలించాలి. వీటి ద్వారా భూమిలో సారం పెరగడంతో పాటు, కర్బన శాతం పెరిగి మొక్కవేర్లు సులువుగా భూమిలోకి చొచ్చుకుపోయి మొక్క సకాలంలో సజావుగా పెరిగేందుకు దోహదపడుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల రైతుకు లాభం చేకూరడంతో పాటు చేనుకు ఎంతో మేలు జరుగుతుంది. పశువులు, కోళ్ల ఎరువులు వేయడం వల్ల పంట వేసిన తరువాత సాధారణ ఎరువుల వాడకం చాలావరకు తగ్గించుకోవచ్చు. చీడపీడల బాధ తగ్గుతుంది. దీంతో రైతు గతంలో వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణకు ఉపయోగించిన రసాయనిక ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల రైతుకు సాగు వ్యయం తగ్గడంతో పాటు సంపూర్ణ నాణ్యత కలిగిన ఉత్పత్తులు సాధించవచ్చు. పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలలో దాదాపు 29,612 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ పంట సాగు చేయనున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం ఎంతో ఉపయోగం



రసాయనిక ఎరువులను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించి సేంద్రియ ఎరువులను అధికంగా వాడకం వల్ల పొలాలకు ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. పంటకు అవసరమైన అన్ని రకాల ముఖ్యపోషకాలను సేంద్రియ ఎరువుల ద్వారా అందించవచ్చు. భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంట ఎండిపోకుండా చేస్తాయి. నేలలో మొక్కలకు మేలు చేసే అన్ని రకాల సూక్ష్మజీవులు ఉంటాయి. సేంద్రియ ఎరువులు అవి అభివృద్ధి చెందడానికి వాటికి ఆహారంగానూ ఉపయోగపడతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పొలంలో చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయి. వీటితో పాటు పచ్చిరొట్టగా చేలల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము వేసుకోవడం ద్వారా చేనుకు మంచి బలవర్ధకమైన ఎరువును అందించినట్లు అవుతుంది.

– ఎస్.జెన్నీ, ఏవో, కృత్తివెన్ను

'రెవెన్యూ' ఖ్యాతి ఇనుమడించేలా సేవలు


మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్


రెవెన్యూ దినోత్సవంలో
పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అవనిగడ్డ: రెవెన్యూ శాఖ ఖ్యాతిని ఇనుమడించేలా అధికారులు సేవలందించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణలో గత ఐదేళ్లలో అవలంబించిన విధానాలు మారాలన్నారు. ప్రకృతి వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ప్రజలు కూడా వారికి సహకరించాలన్నారు. రైతులు, సామాన్యులకు మెరుగైన సేవలందించేలా అధికారులు పని చేయాలన్నారు. అనంతరం రిటైర్డ్ కలెక్టర్ ముక్తేశ్వరరావుని బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంక: ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రాజసం కలిగిన మహోన్నతమైనది రెవెన్యూ వ్యవస్థ మాత్రమేనని పరిశోధకరత్న విశ్రాంత సీనియర్ రెవెన్యూ అధికారి మహ్మద్ సిలార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ హరనాథ మాట్లాడుతూ 238 సంవత్సరాల క్రితం ఈ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. నూతన ప్రభుత్వం నిర్ణయం మేరకు ఇకపై ఏటా జూన్ 20న రెవెన్యూ డే జరుగుతుందని, రైతుల సూచనలు, సలహాలు స్వీకరించి వారికి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సిలార్‌ను ఘనంగా సన్మానించారు. మండల సర్వేయర్ సుధీర్, ఎంపీటీసీ సభ్యులు పుట్టి స్వరూపరాణి, బుడిపల్లి ఆదిశేషు, సర్పంచ్‌లు బెల్లంకొండ శ్రీనివాసరావు, కైతేపల్లి రాజేంద్రప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ప్రభుత్వం నుంచి రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సేవలపై రైతులు, ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కృత్తివెన్ను తహసీల్దార్ సుందర్‌సింగ్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శివ, సర్వేయర్ ప్రభుదాసు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో విశ్రాంత వీఆర్వో తుమ్మల దేవేంద్రరావును ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వో, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెడన: తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన వేడుకలకు పెడన ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీటీలు పూర్ణ చంద్రరావు, కల్పన, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కేక్ కోశారు.

గూడూరు: రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎస్.ఎస్.శాంతి ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో జి.వి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్.సాయిబాబు, భారతరావును సత్కరించారు. కార్యక్రమంలో డీటీ వై.శివశంకర్, ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు పి.కాకుళేశ్వరరావు, ఎం.డి.బషీర్, చలమలశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వై. రవికుమార్ విశ్రాంత వీఆర్వోలు కుటుంబరావు, రామసుబ్బారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఆర్ఐ శేఖర్, సీనియర్ అసిస్టెంటు శంకర్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు పి. శ్రీనివాసరావు, బి. రమేష్, పలుపార్టీల నేతలు పాల్గొన్నారు.

మోపిదేవి: సామాన్య ప్రజలకు రెవెన్యూ అధికారులు మెరుగైన సేవలు అందించాలని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంఆర్ఐ వెంకట కృష్ణారావు, వీఆర్వో నారాయణరావుకు శాలువాలు కప్పి పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఎంఆర్ఐ సునీల్ కుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి 'కొల్లు' పుట్టినరోజు వేడుకలు



కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పెదపట్నంలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు నోటు పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమాల్లో చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కేసన రమేష్ , కట్రం నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు 'కోడూరు, నాగాయలంక'కు విద్యుత్ సరఫరా నిలిపివేత

అవనిగడ్డ: స్థానిక 132 కేవీ సబ్ స్టేషన్ వద్ద నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ కోడూరు, నాగాయలంక మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పోతురాజుస్వామి జాతర ప్రారంభం



వేకనూరు(అవనిగడ్డ): వేకనూరులో మాదివాడ అంకాలమ్మ ఆలయం వద్ద పోతురాజు స్వామి జాతర మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. మూడు రోజుల పాటు జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రేపు మినీ జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: స్థానిక నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 22వ తేదీ శనివారం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా మొదలవుతుందని పేర్కొన్నారు. డీమార్ట్, రిలయన్స్, ఫెడరల్ స్కిల్ అకాడమీ, ఫ్లిప్‌కార్ట్, జ్యోతి ఫెసిలిటీ సెంటర్, కాసా మోటార్స్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. పదో తరగతి, ఐటీఐ డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగులు పూర్తి బయోడేటా, జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 12 నుంచి రూ. 25 వేల వరకు జీతం లభిస్తుందని మరిన్ని వివరాలకు 8142416211 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పైడమ్మ ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుల రాజీనామా

పెడన: పట్టణంలోని పైడమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు చక్రజాముల భగవాన్, శిరివెళ్ల వెంకట సూర్యనాయణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఉత్సవాలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు జమా ఖర్చులు చెప్పలేదని ఆరోపించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సాధారణ సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేత



అవనిగడ్డ: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు, జనసేన నేత మండలి వెంకట్రామ్ (రాజా) జన్మదినం పురస్కరించుకుని పంచాయతీ కార్మికులకు వస్త్రాలను అందజేశారు. స్థానిక గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో వెంకట్రామ్, బుద్ధప్రసాద్ అల్లుడు అశ్వినీకుమార్ చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను బహుకరించారు. స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తొలుత బుద్ధప్రసాద్ స్వగృహంలో జరిగిన వేడుకల్లో వెంకట్రామ్ కేక్ కట్ చేసి బుద్ధప్రసాద్‌కు తినిపించారు. గాంధీక్షేత్రంలో జరిగిన జన్మదిన వేడుకల్లో డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు, ఎస్ఐలతో పాటు పలువురు స్థానిక జనసేన, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రామలింగేశ్వరుడి కల్యాణం


రామలింగేశ్వరుడి సన్నిధిలో కల్యాణం


బేతాళ నృత్య ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేట శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ రంగనాయకస్వామి వార్ల ఆలయాల్లో స్వామివార్ల వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. శ్రీ పర్వత వర్ధిని, శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు – నీరజ, కోట నాగవెంకటజయరాం – శ్రీదుర్గ దంపతులు పీటలపై కూర్చున్నారు. కళ్యాణ ఘట్టాన్ని ఆలయ ముఖ్య అర్చకుడు ఘంటసాల భాస్కరశర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమాలను కార్యక్రమ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో స్వామివార్ల రథోత్సవం జరిగింది. విద్యుత్ దీపాలతో అలంకరించబడిన ప్రత్యేక వాహనంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమాలను ఈడ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం


శ్రీదేవి, భూదేవ సమేత కల్యాణమూర్తులు

కోడూరు: భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. టీటీడీకి చెందిన వేదపండితుల, మరో పది మంది రుత్వికుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారులు యిమ్మడి వెంకట రామకృష్ణ, రాంబాబు, కోడూరు వెంకటేశ్వరరావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ ఉపన్యాసవాచస్పతి మొవ్వ వృషాద్రిపతి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గురువారం గరుడ వాహనంపై కల్యాణమూర్తులకు తిరువీధి ఉత్సవం జరిపారు. కోడూరు, కృష్ణాపురం , ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగింపుకు భక్తులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో పులిహోర రాశిని స్వామివారి నైవేద్యంగా సమర్పించారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం వసంతోత్సవం, మహాపూర్ణాహుతి, శేషవాహనంపై కల్యాణమూర్తుల ఊరేగింపును నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలిపారు.

మూగజీవాలను హింసిస్తే చర్యలు


గో సంఘానికి సురక్షితంగా చేరుకున్న గోవులు

కోనేరుసెంటర్: పండుగల పేరుతో మూగజీవాలను హింసించినా, వాటిని వధించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని పెడనకు చెందిన కొంతమంది గోవులను వధించినట్లు వచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన పోలీసులు పెడన పోలీస్ స్టేషన్లో గోవులను వధించిన వారిపై కేసులు నమోదు చేసి 41 నోటీసులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి నలుగురికి నోటీసులు జారీ చేసిన పెడన పోలీసులు ఆరు గోవులను ఒక లేగ దూడను మచిలీపట్నంలోని గో సంఘానికి సురక్షితంగా తరలించినట్లు తెలిపారు.

'దోనేపూడి'కి నివాళి



దేవరకోట(ఘంటసాల): ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన దోనేపూడి శ్రీరామ కృష్ణయ్య చౌదరి సంవత్సరీకంలో పాల్గొనడానికి గురువారం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు విచ్చేశారు. శ్రీరామకృష్ణయ్య చౌదరి చిత్రపటానికి రఘురామకృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నేతలు దేవరకోట గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు ముమ్మనేని రాజ్ కుమార్ (నాని), మోర్ల రాంబాబు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన

బంటుమిల్లి: మండల పరిధిలో గత 15 రోజులుగా జరుగుతున్న పర్యావరణ దినోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగను ఏర్పాటు చేయడం అభినందనీయమని మండలి సాయి సుప్రియ అన్నారు. మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో సేవా కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ ప్రారంభించారు. జనసేన నేత మండలి వెంకట్రామ్ (రాజా) పుట్టిన రోజు సందర్భంగా శీలం అక్షర, అద్విక సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. జనార్ధనరావు, రత్నగిరి, సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి కల్యాణ మహోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జగన్నాథపురంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ జగన్నాథ స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం స్వామివారు, అమ్మవార్లను పెండ్లికుమారునిగా, పెండ్లి కుమార్తెలుగా చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

శ్రీకాకుళం(ఘంటసాల): దాతల సాయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ యువనేత మండలి వెంకట్రామ్ జన్మదినం సందర్భంగా ఘంటసాల మండలం శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్లోని 200 మంది విద్యార్థులకు ఎంపీటీసీ వెంకటేశ్వరరావు (చిన్నా) రూ.10 వేల విలువైన ప్లేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే

20సీహెచ్‌పీఎల్52

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన 10 మందికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), ఐసీడీఎస్ శ్రీకాకుళం సెక్టార్ సూపర్ వైజర్ డి.మేరీ, హాస్టర్ వార్డెన్ పి.జ్ఞాన సుందరి, పాఠశాల హెచ్ఎం టి.నాగబాబు, మహిళా కానిస్టేబుల్ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



కృత్తివెన్ను: గాంధీనగరంలోని శ్రీ అభయ సిద్ధి విఘ్నేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు, గణపతి హోమాలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి


అవగాహన ర్యాలీలో విద్యాశాఖాధికారులు

కోనేరుసెంటర్: బడిఈడు పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఏపీసీ శ్రీరాములు నాయక్ తెలిపారు. కృష్ణా జిల్లా విద్యాశాఖ సమగ్ర కృష్ణల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బందరు మండలంలోని ఎస్ఎన్ గొల్లపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాములు నాయక్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు తరగతి గదుల్లోనే అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యావంతులు అన్ని విషయాల్లోనూ చైతన్యం కలిగి ఉంటారన్నారు. నిరక్షరాస్యత కలిగిన కుటుంబం ప్రతి విషయంలోనూ ఇతరులపై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ రామకృష్ణ, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్, ఆర్ శ్యాంసుందర్ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఐఈడీ కోఆర్డినేటర్ కే ఏడుకొండలు, జి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాసనాలు

గూడూరు: అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. పీడీ మత్తి అరుణ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు వివిధ ఆసనాలు వేశారు. యోగా ఆసనాలతో కలిగే ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ఆమె కోరారు. శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

రూ.52,616కు లడ్డూల వేలం

కోడూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూల వేలంపాటల ద్వారా ఆలయానికి రూ.52,616 ఆదాయం లభించినట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి కల్యాణాన్ని పురస్కరించుకొని మూడు లడ్డూలకు వేలం పాట జరిపారు. 20కేజీల లడ్డూను కోడూరుకు చెందిన సింగం హనుశ్రీ రూ.21,00కు, 10కేజీల లడ్డూను జల్లూరి గణేష్ రూ.20,116కు, ఐదు కేజీల లడ్డూను చిట్టూ మురళీకృష్ణ రూ.11 వేలకు లడ్డూను పాట ద్వారా దక్కించుకున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు.

వార్డు శానిటేషన్ కార్యదర్శులకు మెమో

పెడన: పట్టణంలోని 1,4,6,7,8 వార్డులకు చెందిన శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులకు పెడన మున్సిపల్ కమిషనర్ మెమో జారీ చేశారు. బక్రీద్ పండుగ రోజు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయినందుకు మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు. సదరు కార్యదర్శులు ఎఫ్–1 గుమస్తా నుంచి మెమోలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలి


గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో కిట్లు పంపిణీ చేస్తున్న అతిథులు

గోగినేనిపాలెం(ఘంటసాల): ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు అన్నారు. ఘంటసాల మండలం గోగినేని పాలెం, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్స్‌లోని విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను శుక్రవారం ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. గోగినేనిపాలెం హైస్కూల్లోని విద్యార్థులకు వైస్ ఎంపీపీ నాగేంద్ర, సర్పంచ్ కుంపటి సుశీల, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోనేరు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు చేతుల మీదగా పంపిణీ చేయగా, శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్‌లో సర్పంచ్ ముప్పనేని రవి, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి చేతుల మీదగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు.